# ప్రజాతీర్పు
## - 2024 -

II | కరీంనగర్, ఆదివారం 12 మే 2024 | నమస్తే తెలంగాణ | www.ntnews.com

## మూడో విడతలో 65.68 శాతం పోలింగ్

న్యూఢిల్లీ, మే 11: ఈ నెల 7న జరిగిన లోక్‌సభ మూడో విడత ఎన్నికల తుది పోలింగ్ శాతాన్ని ఎన్నికల సంఘం శనివారం వెల్లడించింది. 65.68 శాతం ఓటింగ్ నమోదైనట్టు తెలిపింది. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో మూడో విడత 68.4 శాతం పోలింగ్ నమోదు కాగా, ఇప్పుడు దాని కన్నా సుమారు మూడు శాతం తగ్గింది. కాగా ఓటింగ్ జరిగిన మరునాడు సైతం ఈసీ ఇంచుమించు ఇదే పోలింగ్ శాతాన్ని ప్రకటించింది. మూడో విడతలో 11 రాష్ట్రాలు, యూటీల్లోని 93 నియోజవకర్గాల్లో ఎన్నికలు జరగగా, 68.89 శాతం పురుషులు, 64.4 శాతం మహిళలు, 25.2 శాతం ట్రాన్స్‌జెండర్లు ఓటు వేశారు.

# ప్రాంతీయ పార్టీలే కింగ్ మేకర్స్!

- చాలా రాష్ట్రాల్లో బలంగా రీజినల్ పార్టీలు
- మోదీ 'మూడోసారి' ఆశలకు చెక్ పెట్టే చాన్స్
- బూమ్‌రాంగ్ అయిన '400+' నినాదం!
- విపక్షాల ఐక్యతతో ఓట్ల చీలికకు బ్రేక్

న్యూఢిల్లీ, మే 11: లోక్‌సభ ఎన్నికల్లో 400కుపైగా సీట్లు సాధించాలని లక్ష్యంగా పెట్టుకొన్న బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమికి క్షేత్రస్థాయిలో అనుకూల పరిస్థితులు కనిపించడం లేదు. 200 సీట్లు కూడా దాటవనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. పశ్చిమ బెంగాల్, తెలంగాణ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ సహా చాలా రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు బలంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో బీజేపీ '400+' కలలకు ప్రాంతీయ పార్టీలు చెక్ పెడుతాయని విశ్లేషకులు అంటున్నారు. వివిధ రాష్ట్రాల్లో జరిగిన, జరుగుతున్న ఎన్నికల్లో ప్రాంతీయ పార్టీలే నిర్ణయాత్మక పాత్ర పోషిస్తాయని తెలుస్తున్నది. ఈ సారి భారీ మెజార్టీతో విజయం సాధించాలన్న బీజేపీ ప్లాన్‌ను పలు అంశాలు అడ్డుకొంటున్నాయి.

### పుంజుకొన్న ప్రాంతీయ పార్టీలు

దేశంలో ప్రాంతీయ పార్టీలకు చెక్కు చెదరని చరిత్ర ఉన్నది. గత కొన్నేండ్లుగా పలు పార్టీలు పుంజుకొని.. జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్‌ను సవాల్ చేసే స్థితికి వచ్చాయి. పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్, తెలంగాణలో బీఆర్ఎస్, ఏపీలో వైసీపీ, మహారాష్ట్రలో ఎన్సీపీ, తమిళనాడులో డీఎంకే, ఒడిశాలో బీజేడీ, జార్ఖండ్‌లో జేఎంఎం, యూపీలో ఎస్పీ, బీహార్‌లో ఆర్జేడీ వంటి పార్టీలతో పాటు ఈశాన్య రాష్ట్రాల్లో పలు పార్టీలు బలంగా ఉన్నాయి. మరోవైపు ఢిల్లీ, పంజాబ్‌లో అధికారంలో ఉన్న కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆప్.. బీజేపీ జోరుకు అడ్డుగా మారింది. పలు రాష్ట్రాల్లో ఆ పార్టీ తన ప్రభావాన్ని చాటుకొనేందుకు ప్రయత్నాలు చేస్తున్నది.

### '400+' నినాదంపై ప్రజల్లో ఆందోళన

'ఆబ్‌కీ బార్ 400 పార్ (ఈసారి 400కు పైగా స్థానాలు)' నినాదం చుట్టూనే ప్రధాని మోదీ ఎన్నికల ప్రచారం సాగుతున్నది. రాజ్యాంగాన్ని మార్చేందుకే అవసరమైన సంఖ్యా బలం కోసం బీజేపీ ఈ నినాదం ఎత్తుకొన్నదని ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయి. ఈ క్రమంలో రాజ్యాంగం కల్పించిన హక్కులను లాగేసుకొంటారనే ఆందోళన దళితులు, ఆదివాసీలు, బలహీన వర్గాలు, మైనారిటీల్లో నెలకొన్నది. ఈ నేపథ్యంలో బీజేపీ ఎత్తుకొన్న ఆ నినాదం ఆ పార్టీకి వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రాంతీయ పార్టీలకు ప్రచారాస్త్రంగా మారింది. మోదీ మూడోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తుందని, రిజర్వేషన్లను రద్దు చేస్తుందని కాంగ్రెస్ కూడా ప్రచారం చేస్తున్నది.

### విపక్ష పార్టీల మధ్య ఐక్యతతో బీజేపీ వ్యతిరేక ఓట్ల చీలికకు చెక్!

గతంలో విపక్షాలు ప్రభుత్వ వ్యతిరేకతను చీల్చడంతో.. అది బీజేపీ లాభించింది. అయితే ఈసారి విపక్ష పార్టీలు కలిసి కూటమిగా బీజేపీకి వ్యతిరేకంగా పోటీచేస్తున్నాయి. సీట్లను పంచుకోవడంతో ఓట్ల చీలికకు అవకాశం లేకుండా పోయింది. అయితే యూపీ, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో ఈ మంత్రం పనిచేయలేదు. యూపీలో కాంగ్రెస్-ఎస్పీ లతో కలవకుండా మాయావతి నేతృత్వంలోని బీఎస్పీ వేరుగా పోటీచేస్తున్నది. బెంగాల్‌లో కూడా మమత నేతృత్వంలోని టీఎంసీ రాష్ట్రంలోని అన్ని స్థానాల్లో బరిలో నిలిచారు. మరోవైపు ఇక్కడ కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలు కూటమిగా పోటీకి నిలిచాయి.

### ఎన్డీయేకు వ్యతిరేకత

బీహార్ వంటి రాష్ట్రాల్లో మిత్రపక్ష పార్టీలపై వ్యతిరేకత వల్ల బీజేపీ తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చే అవకాశం కనిపిస్తుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. మరోవైపు ఎమ్మెల్యేలను పెద్దయెత్తున ఫిరాయింపులు చేయడం ద్వారా పలు రాష్ట్రాల్లో ప్రభుత్వాలను కూల్చి, బీజేపీ గద్దెనెక్కడంపై కూడా ప్రజలు తీవ్ర అసంతృప్తిగా ఉన్నట్టు తెలుస్తున్నది. తమిళనాడులో అన్నాడీఎంకే వంటి ప్రాంతీయ పార్టీని కూటమిలో చేర్చుకోవడంలో విఫలం కావడం, కర్ణాటక, బీహార్ వంటి రాష్ట్రాల్లో వ్యతిరేకత ఉన్న పార్టీలతో జట్టు కట్టడం బీజేపీకి ప్రతికూలంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## రెండు నెలల్లో యోగి అవుట్

- మోదీ గెలిస్తే అయన రాజకీయ జీవితాన్ని అంతం చేస్తారు
- ఆయనకూ అద్వానీ, మనోహర్ జోషిలకు ఎదురైన పరిస్థితే
- ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయేకు 230 సీట్లు దాటవు
- వచ్చే ఏడాదితో మోదీకి 75 ఏండ్లు
- ఆయన రిటైర్ కాబోతున్నారు
- ఢిల్లీ ముఖ్యమంత్రి ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ సంచలన వ్యాఖ్యలు

విలేకరులతో మాట్లాడుతున్న కేజ్రీవాల్

న్యూఢిల్లీ, మే 11: నరేంద్ర మోదీ 'ఒకే దేశం, ఒకే నాయకుడు' మిషన్‌ను ప్రారంభించారని, ఆయన మళ్లీ గెలిస్తే రెండు నెలల్లో యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌ను మార్చేస్తారని ఢిల్లీ సీఎం, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అద్వానీ, మురళీ మనోహర్ జోషి, శివ్‌రాజ్ సింగ్ చౌహాన్, వసుంధర రాజే, మనోహర్‌లాల్ ఖట్టర్, రమణ్ సింగ్ రాజకీయ జీవితాలను మోదీ అంతం చేశారని.. ఇక యోగి ఆదిత్యనాథ్ రాజకీయ జీవితాన్ని అంతం చేస్తారని అన్నారు. జైలు నుంచి విడుదలైన తర్వాత శనివారం ఆయన ఢిల్లీలో మొదటిసారి మీడియా సమావేశంలో మాట్లాడారు. 75 ఏండ్లకు రిటైర్‌మెంట్ అనే నిబంధనను బీజేపీలో మోదీనే తీసుకొచ్చారని, వచ్చే ఏడాది 75 ఏండ్లు పూర్తి చేసుకుంటున్న మోదీ రిటైర్ అవుతారని కేజ్రీవాల్ చెప్పారు. ఒకవేళ మళ్లీ బీజేపీ గెలిస్తే వెంటనే యోగిని తప్పించేసి అమిత్ షాను ప్రధానిని చేస్తారని కేజ్రీవాల్ చెప్పారు. బీజేపీకి ఓటేసే వారు మోదీకి ఓటు వేయడం లేదని, అమిత్ షాకు ఓటు వేస్తున్నారనే విషయాన్ని అర్థం చేసుకోవాలని కోరారు.

### ఎన్డీయేకు 230 సీట్లు దాటవు

జైలు నుంచి విడుదలైన తర్వాత తాను ప్రజలు, ఎన్నికల నిపుణులతో మాట్లాడానని.. బీజేపీ మళ్లీ అధికారంలోకి రావడం లేదని కేజ్రీవాల్ పేర్కొన్నారు. హర్యానా, రాజస్థాన్, బీహార్, యూపీ, ఢిల్లీ, కర్ణాటక, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్‌లో బీజేపీ సీట్లు గణనీయంగా తగ్గుతున్నాయని తెలిపారు. ఎన్డీయేకు ఈసారి 220 – 230 సీట్లకు మించి రావని పేర్కొన్నారు. కాగా, ఎన్డీఏ మళ్లీ అధికారంలోకి వస్తే మమత బెనర్జీ, స్టాలిన్ సహా ప్రతిపక్ష నేతలు అందరినీ జైలుకు పంపిస్తారని కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. ఇప్పటికే జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్, ఢిల్లీ, పశ్చిమ బెంగాల్ మంత్రులను జైలుకు పంపించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. 'మన దేశం చాలా పాతది. నియంతలు దేశాన్ని అధీనంలోకి తీసుకోవాలని అనుకున్నప్పుడల్లా ప్రజలు వారిని పెకిలించేశారు. ఇవాళ మళ్లీ ఒక నియంత మన ప్రజాస్వామ్యాన్ని అంతం చేయాలను కుంటున్నారు.' అని ఆయన పేర్కొన్నారు.

### 75 ఏండ్ల నిబంధన లేదు: అమిత్‌షా

75 ఏండ్ల వయస్సు తర్వాత మోదీ రాజకీయాల నుంచి రిటైర్ అవుతారని కేజ్రీవాల్ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ అగ్రనేత అమిత్ షా స్పందించారు. బీజేపీ రాజ్యాంగంలో 75 ఏండ్లకు రిటైర్ అవ్వాలనే నిబంధన ఏమీ లేదని ఆయన పేర్కొన్నారు. మోదీనే తన పదవీ కాలాన్ని పూర్తి చేస్తారని, భవిష్యత్తులోనూ దేశాన్ని నడిపిస్తారని, ఇందులో గందరగోళం ఏమీ లేదని ఆయన స్పష్టం చేశారు. కాగా, కేజ్రీవాల్ సరైన అంశాన్ని లేవనెత్తారని, మోదీ చేసిన 75 ఏండ్ల నిబంధనపై మోదీనే స్పష్టత ఇవ్వాలని ఆమ్ ఆద్మీ పార్టీ నేత సంజయ్ సింగ్ పేర్కొన్నారు. మోదీ చేసిన నిబంధనలు ఇతర నేతలకు వర్తిస్తాయి కానీ మోదీకి వర్తించవని అమిత్ షా చెప్పున్నారని ఆయన పేర్కొన్నారు.

## లైంగిక దాడి చేసి.. ట్రాలీ కింద పడేసి

### యూపీలో బాలికపై దురాగతం

న్యూఢిల్లీ, మే 11: ఉత్తరప్రదేశ్‌లోని బరేలీలో గల ఫరీదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం చోటుచేసుకుంది. ఓ బాలికపై ఇద్దరు యువకులు లైంగిక దాడికి పాల్పడ్డారు. శనివారం పోలీసులు తెలిపిన కథనం ప్రకారం లైంగిక దాడి అనంతరం నిందితులు ఆమె కాళ్లు, చేతులు కట్టేసి ఓ ట్రాలీ కింద పడేసి పారిపోయారు. లైంగిక దాడి సమాచారం అందుకొన్న వెంటనే పోలీసులు ఆమెను రక్షించారు. బాధితురాలు స్పృహలోకి రావడానికి చాలా సమయం పట్టింది. తర్వాత ఆమెను కుటుంబ సభ్యులకు అప్పగించారు. బాధితురాలి వాంగ్మూలం ఆధారంగా నిందితులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఏపీలో 7 కోట్లు స్వాధీనం

విజయవాడ, మే 11: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు సిద్ధమైన ఆంధ్రప్రదేశ్‌లో అక్రమ సొమ్ము భారీగా బయటపడుతున్నది. శుక్రవారం ఒక వాణిజ్య వాహనంలో రూ.7 కోట్లను తరలిస్తుండగా తూర్పుగోదావరి పోలీసులు పట్టుకున్నారు. భారీగా సొమ్మును తరలిస్తున్న ఈ వాహనాన్ని నల్లజర్ల మండలం అనంతపల్లిలో ఒక లారీ ఢీకొనడంతో బోల్తాపడింది. దీంతో ఆ వాహనంలో ఉన్న ఏడు అట్టపెట్టెల్లోని నగదును వేరే ప్రదేశానికి తరలించడానికి ప్రయత్నించారు. స్థానికుల సమాచారంతో పోలీసులు వాటిని స్వాధీనం చేసుకుని అందులోని నగదును లెక్కించగా, సుమారు ఏడు కోట్ల రూపాయలున్నట్టు తేలింది.

## ఒక్క ప్రెస్ మీటైనా పెట్టలేదేం?

### పోలింగ్ శాతాల వెల్లడిలో ఈసీ జాప్యంపై జర్నలిస్టు సంఘాల ఆశ్చర్యం

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల పోలింగ్ శాతాల వెల్లడిలో ఈసీ జాప్యంపై జర్నలిస్టు సంఘాలు ఆశ్చర్యం వ్యక్తం చేశాయి. గతంలో ఇలా ఎన్నడూ జరుగలేదని, దీని వల్ల ఎన్నికల పారదర్శకతపై ప్రజల్లో అనుమానాలు రేకెత్తుతాయని ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ మేరకు ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా, ప్రెస్ అసోసియేషన్, ఇండియన్ ఉమెన్ ప్రెస్ కార్ప్, ఢిల్లీ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ శనివారం ఈసీకి లేఖ రాశాయి. మూడు దశల ఎన్నికల పూర్తయిన ప్పటికీ, ఈసీ ఒక్క మీడియా సమావేశం కూడా నిర్వహించకపోవడాన్ని ప్రశ్నించాయి. గతంలో మాదిరిగా ప్రతి దశ పోలింగ్ తర్వాత మీడియా సమావేశం నిర్వహించాలని, ఓటింగ్ తర్వాతి రోజున తుది పోలింగ్ శాతాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశాయి.

## అక్షయ్‌పై అరెస్టు వారెంట్

### కాంగ్రెస్ అభ్యర్థిగా వైదొలగి బీజేపీలో చేరినా తప్పని షాక్

ఇండోర్, మే 11: ఇటీవల మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ ఉపసంహరించుకొని, బీజేపీలో చేరిన అక్షయ్ బామ్‌కు గట్టి షాక్ తగిలింది. 17 ఏండ్ల క్రితం నాటి ఓ హత్యాయత్నం కేసులో అక్షయ్‌తోపాటు అయన తండ్రిపై స్థానిక సెషన్స్ కోర్టు అరెస్టు వారెంట్ జారీ చేసింది. వాళ్లిద్దరిని అరెస్టు చేసి, జూలై 8లోగా కోర్టు ముందు హాజరు పరచాలని ఆదేశించింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ అభిజిత్ సింగ్ మాట్లాడుతూ అక్షయ్, ఆయన తండ్రి శుక్రవారం కోర్టు ముందు విచారణకు హాజరు కావాల్సి ఉన్నదన్నారు. అయితే వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు కోరుతూ వాళ్ల తరపున న్యాయవాది కోర్టును ఆశ్రయించారని తెలిపారు. అయితే ఈ అభ్యర్థనను సెషన్స్ కోర్టు తిరస్కరించి అరెస్టు వారెంట్ జారీ చేసిందని తెలిపారు.

## గవర్నర్ పుల్ వీడియో నా దగ్గరుంది

- లైంగిక వేధింపుల ఆరోపణలొస్తే పదవికి రాజీనామా చేయరా?
- ఆయన పక్కన కూర్చోవడం కూడా పాపమే: మమతా బెనర్జీ

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద బోస్‌పై వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణల విషయంలో ఆ రాష్ట్ర సీఎం మమతా బెనర్జీ కీలక వ్యాఖ్యలు చేశారు. గవర్నర్ విడుదల చేసిన వీడియో ఎడిటింగ్ చేసినదని.. పూర్తి నిడివిగల వీడియో తన వద్ద ఉందని వెల్లడించారు. శనివారం ఆమె సప్తగ్రామ్‌లో ఎన్నికల ప్రచార సభలో మాట్లాడారు. లైంగిక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో ఆనంద బోస్ తన పదవికి ఎందుకు రాజీనామా చేయకూడదో చెప్పాలని డిమాండ్ చేశారు. ''మిస్టర్ గవర్నర్, మీ దాదాగిరి ఇక చెల్లదు. మీరు ముందు గద్దె దిగండి. మహిళలను హింసించడానికి మీరెవరు?'' అని మమత ప్రశ్నించారు. గవర్నర్ మీడియాను పిలిచి, కొన్ని ఎడిట్ చేసిన వీడియోలను చూపించారని తాను విన్నానన్నారు. అయితే తన వద్ద ఎడిట్ చేయని పూర్తి వీడియో ఉందని, దానిని ఓ విలేకరి ఇచ్చారని చెప్పారు. ''ఆయన నన్ను రాజ్ భవన్‌కు పిలిస్తే నేను వెళ్లను. వీధుల్లో కలవాలనుకుంటే కలుస్తాను. ఇలాంటి సంఘటనల గురించి విన్నాక ఆయన పక్కన కూర్చోవడం కూడా పాపమే'' అని మమత అన్నారు.కాగా గవర్నర్ బోస్ ఈ నెల 9న కొన్ని సీసీటీవీ ఫుటేజ్‌లను మీడియా సమక్షంలో ప్రదర్శించారు.

## సివిల్ సర్వీసెస్ తుప్పు పట్టాయి

- సంస్కరించి కొత్తగా ఆవిష్కరించాలి
- ఆర్‌బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు

న్యూఢిల్లీ, మే 11: భారత్‌లోని సివిల్ సర్వీసులు, ఇండియన్ అడ్మినిస్ట్రేషన్ సర్వీస్ (ఐఏఎస్) వ్యవస్థను సంస్కరించి..వాటిని కొత్తగా ఆవిష్కరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు ఉద్ఘాటించారు. ఈ వ్యవస్థలో నీతి, నిజాయితీ తగ్గుతున్నట్టు తాను భావిస్తున్నానన్నారు. ఆయన ప్రచురించిన 'జస్ట్ ఏ మెర్సినరీ?: నోట్స్ ఫ్రమ్ మై లైఫ్ అండ్ కెరీర్' పుస్తకంలో ఐఏఎస్ వ్యవస్థను ప్రక్షాళన చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు.'ఎప్పుడో బ్రిటీష్‌వారు తయారు చేసిన ఐఏఎస్ అనే స్టీల్ ఫ్రేమ్ ఇప్పుడు తుప్పు పట్టింది. అలా అని దాన్ని బయటకు విసిరేయమని కాదు. దానిని సరిచేసి పూర్వ వైభవం తేవాల్సిన అవసరం ఉంది' అని అన్నారు. ఐఏఎస్‌ల్లో ఉన్న లింగ వివక్ష గురించి ఆయన ప్రస్తావించారు.

## బీజేపీకి లఖింపూర్ టెన్షన్!

- యూపీలో నాలుగో దశలో 13 సీట్లకు ఎన్నికలు
- రైతులు హత్యకు గురైన లఖింపూర్‌కూ ఈ దశలోనే
- గత ఎన్నికల్లో 13 సీట్లనూ గెలుచుకున్న కమలం
- ఈసారి విజయం అంత ఈజీ కాదంటున్న విశ్లేషకులు

లఖింపూర్ ఘటన (ఫైల్)

లక్నో, మే 11: లోక్‌సభ నాలుగో దశ ఎన్నికలకు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. యూపీలో 13 సీట్లకు ఈ విడతలో ఎన్నికలు జరుగనున్నాయి. 2019 ఎన్నికల్లో అవధ్, బుందేల్‌ఖండ్ రీజియన్లలో గెలుచుకొన్న ఈ అన్ని స్థానాలను తిరిగి నిలబెట్టుకోవడం అధికార బీజేపీకి సవాల్‌గా మారింది. రాష్ట్రంలో పట్టు కోసం ప్రయత్నిస్తున్న ఎస్పీ, కాంగ్రెస్ కూటమి.. ఈసారి ఎలాగైనా కమలం పార్టీకి గట్టి ఝలక్ ఇవ్వాలని ముమ్మర ప్రచారం నిర్వహించాయి. యూపీలోని షాజహాన్‌పూర్, లఖింపూర్ ఖేరీ, ధౌర్హర, సీతాపూర్, హర్దోయ్, మిస్రిఖ్, ఉన్నావో, ఫరూఖాబాద్, ఇథవా, కన్నౌజ్, కాన్పూర్, అక్బర్‌పూర్, బహ్రైచ్ స్థానాల్లో నాలుగో దశ పోలింగ్ జరుగుతుంది. కాన్పూర్, బహ్రైచ్ స్థానాలను మినహా మిగతా చోట్ల బీజేపీ సిట్టింగ్‌లకే టికెట్లు ఇచ్చింది.

### రైతుల డిమాండ్‌ను పట్టించుకోని కేంద్రం

కేంద్రం తీసుకొచ్చిన నూతన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా సాగిన రైతాంగ ఉద్యమంలో లఖింపూర్ ఖేరీ ఘటన ఒక విషాదంగా నిలిచిన విషయం తెలిసిందే. ఆందోళన చేస్తున్న రైతులను కారుతో తొక్కించి చంపిన ఘటనపై దేశవ్యాప్తంగా ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. ఈ ఘటనలో కేంద్ర మంత్రి అజయ్ మిశ్రా కుమారుడు ఆశిష్ మిశ్రా నిందితుడిగా ఉన్నాడు. అయితే ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి అజయ్ మిశ్రాను పదవి నుంచి తొలగించాలని రైతు సంఘాలు డిమాండ్ చేసినా మోదీ సర్కార్ పట్టించుకోకపోవడంపై అన్నదాతలు ఆగ్రహంగా ఉన్నారు. రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఉన్నప్పటికీ, ఈ స్థానం నుంచి అజయ్ మిశ్రాకే బీజేపీ టికెట్ ఇవ్వడం గమనార్హం. ఎన్నికల్లో బీజేపీకి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నామని రైతు సంఘాలు ప్రకటించిన విషయం తెలిసిందే. లఖింపూర్ ఖీరీలో ఎస్పీ అభ్యర్థిగా ఉత్కర్ష్ వర్మ పోటీచేస్తున్నారు.

### కన్నౌజ్ స్థానంపై అందరి దృష్టి

కన్నౌజ్ లోక్‌సభ స్థానం అఖిలేశ్ యాదవ్ నేతృత్వంలోని సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ)కి ప్రతిష్ఠాత్మకంగా మారింది. ఇక్కడి నుంచి గత ఎన్నికల్లో పోటీచేసిన అఖిలేశ్ భార్య డింపుల్ యాదవ్ బీజేపీ అభ్యర్థి సుబ్రత్ పాఠక్ చేతిలో ఓటమి పాలయ్యారు. ఈసారి కన్నౌజ్ నుంచి అఖిలేశ్ యాదవ్ పోటీచేస్తుండటం ఆసక్తికరంగా మారింది. బీజేపీ నుంచి ఈసారి కూడా సుబ్రత్ పాఠక్‌నే బరిలో ఉండటం గమనార్హం. ఇక్కడ బీఎస్పీ అభ్యర్థిగా ఇమ్రాన్ పోటీచేస్తున్నారు. మరోవైపు కాన్పూర్ నియోజకవర్గంలో బీజేపీ, ఎస్పీ, బీఎస్పీ పార్టీల తరపున కొత్త ముఖాలు బరిలో నిలిచాయి. బహ్రైచ్‌లో సిట్టింగ్ ఎంపీ అక్షయ్‌వార్ లాల్ గోండ్ స్థానంలో ఆయన కుమారుడు ఆనంద్‌కు బీజేపీ టికెట్ ఇచ్చింది.

## ప్రజ్వల్ కేసు బయటపెట్టిన బీజేపీ నేత అరెస్ట్

### లైంగికంగా వేధించారని మహిళ ఫిర్యాదు

బెంగళూరు: మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడినట్టు జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణపై బీజేపీ కర్ణాటక శాఖ అధ్యక్షుడికి లేఖ రాసిన ఆ పార్టీ నేత, న్యాయవాది జీ దేవరాజ గౌడను కర్ణాటక పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. తనను లైంగికంగా వేధించారంటూ ఓ మహిళ (36) ఇచ్చిన ఫిర్యాదు మేరకు, ఆయన బెంగళూరు నుంచి చిత్రదుర్గ వెళ్తుండగా పోలీసులు అరెస్ట్ చేశారు. ఆయనను మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చగా 14 రోజుల రిమాండ్‌కు పంపారు. తన భూమిని అమ్మేందుకు సాయపడతానని చెప్పి, ఆయన తనను వేధించారని, లైంగిక దాడికి పాల్పడ్డాడని ఫిర్యాదుదారు ఆరోపించారు. కాగా, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో హెచ్‌డీ రేవణ్ణపై బీజేపీ అభ్యర్థిగా దేవరాజె పోటీ చేసి ఓడారు.

## ఎన్నికల్లో మహా సర్కారుకు గుణపాఠం చెప్తాం

### మరాఠా నేత జరాంగే హెచ్చరిక

జాల్నా, మే 11: తమకు రిజర్వేషన్లు నిరాకరించడమే కాక, దాని కోసం ఆందోళన చేస్తున్న వారిని కేసులు, అరెస్టులతో వేధిస్తున్న మహారాష్ట్రలోని మహాయుత్ ప్రభుత్వానికి ఈ ఎన్నికల్లో మరాఠా సామాజిక వర్గం తగిన విధంగా బుద్ధి చెబుతుందని మరాఠా కోటా ఉద్యమ నేత మనోజ్ జరాంగే హెచ్చరించారు. విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కోసం గత ఏడాది ఆందోళన చేసిన ఉద్యమకారులపై ఎందుకు కేసులు నమోదు చేశారని ప్రభుత్వాన్ని ఆయన ప్రశ్నించారు. ఈ ఎన్నికల్లో మద్దతుపై తమ వర్గం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశారు. తమ సామాజిక వర్గం ఐక్యత, పోరాటం కారణంగానే ఓటమి భయంతో ప్రధాని నరేంద్ర మోదీ మహారాష్ట్రలో ఎక్కువగా ప్రచారం చేస్తున్నారని అన్నారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న తమ వారిపై శివసేన-బీజేపీ-ఎన్సీపీ ప్రభుత్వం అక్రమంగా కేసులు నమోదు చేసిందని, ఈ ఎన్నికల్లో అది తగిన మూల్యం చెల్లించుకుంటుందని అన్నారు. విపక్ష ఎంపీఏ కూటమి వైఖరిపైనా జరాంగే ఆగ్రహం వ్యక్తం చేశారు.

## కాలుష్యానికి 'కొత్త' కళ్లెం

లండన్, మే 11: కార్బన్ డయాక్సైడ్‌తో పాటు పలు గ్రీన్‌హౌస్ వాయువులను శోషించుకొని, కాలుష్యాన్ని తగ్గించగలిగే సరికొత్త పదార్థాన్ని యూకే, చైనాకు చెందిన శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ధ్రువ అణువులు సమృద్ధిగా ఉండే ఈ పదార్థాన్ని 'పంజరాల పంజరం'గా పిలుస్తున్నారు.ఇది కార్బన్ డయాక్సైడ్ వంటి గ్రీన్‌హౌస్ వాయువులను శోషించుకుంటుందని శాస్త్రవేత్తలు తెలిపారు. ఇది నీటిలో మరింత స్థిరత్వంతో పని చేస్తుందని.. తేమ, తడి వాయు ప్రవాహాల నుంచి సైతం ఇది కార్బన్ డయాక్సైడ్‌ను గ్రహిస్తుందన్నారు. పారిశ్రామిక కాలుష్యాన్ని నివారించడమే కాక, అత్యంత శక్తిమంతమైనదిగా గుర్తించిన సల్ఫర్ హెక్సాఫ్లోరైడ్(ఎస్ఎఫ్6)ను కూడా ఇది శోషించుకుంటుందని పేర్కొన్నారు.




## ఏఐతో వాతావరణ సంక్షోభం అధ్యానం

న్యూఢిల్లీ: చాట్‌జీపీటీ, సామాజిక మాధ్యమాలు, కృత్రిమ మేధ (ఏఐ) వల్ల వాతావరణ సంక్షోభం మరింత దుర్భరమవుతుందని బ్రిటిష్ కొలంబియా విశ్వవిద్యాలయం పరిశోధకులు చెప్తున్నారు. 'గ్లోబల్ ఎన్విరాన్‌మెంటల్ పాలిటిక్స్' జర్నల్‌లో వీరు రాసిన వ్యాసం ప్రకారం వాతావరణ మార్పులపై చర్యల విషయంలో ఏఐ, సోషల్ మీడియా, ఇతర టెక్ ప్రొడక్ట్స్, ప్లాట్‌ఫామ్స్ స్పందించకుండా ఉండటం కాని, సకారాత్మకంగా వ్యవహరించడం కాని చేస్తాయనే భావన ఉంది. ఇవి నృజనాత్మకంగా ఆలోచించగలిగే సామర్థ్యాన్ని, సమస్యలను పరిష్కరించగలిగే సత్తాను తగ్గిస్తాయి. వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి ఇవి చాలా ముఖ్యం. అయితే ఈ ప్లాట్‌ఫామ్స్ మానవాళిని వేధిస్తున్న ప్రపంచ సమస్యల నుంచి మన దృష్టిని మళ్లిస్తాయని పరిశోధకులు చెప్తున్నారు. అంతే కాకుండా అవి నైరాశ్య భావనలను పెంపొందిస్తాయని చెప్పారు.

## 'వంటనూనెల్లో ఈయూ ప్రమాణాలు పాటించాలి'

న్యూఢిల్లీ: వంట నూనెల్లో ప్రమాదకరమైన జీఈ, 3-ఎంసీపీడీ కలుషితాలు పరిమితికి మించకుండా చూడాలని, ఈ విషయంలో ఇటీవల యూరోపియన్ యూనియన్‌లో తీసుకువచ్చిన ప్రమాణాలను మన దేశంలోనూ పరిగణలోకి తీసుకోవాలని వైద్య నిపుణులు కోరుతున్నారు. గ్లైసిడైల్ ఈస్టర్(జీఈ), 2-మోనోక్లోరోప్రొపేన్-1, 2-డయోల్ ఈస్టర్(3-ఎంసీపీడీ) అధికంగా ఉండటం ఆరోగ్యానికి హానికరమని, గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి తీవ్ర అనారోగ్య సమస్యలకు ఇవి దారి తీస్తాయని చెప్తున్నారు. వినియోగదారుల ఆరోగ్యాలను కాపాడటం కోసం ఆహారంలో జీడీ, 3-ఎంసీపీడీపై పరిమితి విధిస్తూ యూరోపియన్ యూనియన్ పలు ప్రమాణాలను అమలు చేస్తున్నదని మేదాంత హాస్పిటల్ చైర్మన్, కార్డియాలజీ హెడ్ డాక్టర్ ప్రవీణ్ చంద్ర తెలిపారు. భారత్‌లో కూడా కొత్త నిబంధనలు తీసుకురావాల్సిన అవసరం ఉందని సూచించారు.



## భారీ సౌర తుఫానుతో పవర్ గ్రిడ్స్‌పై ప్రభావం!

న్యూఢిల్లీ, మే 11: అత్యంత బలమైన సౌర త